వేంకటాద్రికి మార్గం సుగమం

- రూ.1.50 కోట్లతో రహదారుల నిర్మాణం
- సుందరంగా రూపుదిద్దుకున్న తొలి ఘాట్ రోడ్డు
- తుదిదశకు చేరుకున్న రెండో ఘాట్ రోడ్డు పనులు

ఉత్తరాంధ్ర తిరుమలగా పేరొందిన పెందుర్తి వేంకటాద్రికి రాకపోకలు సాగించేందుకు వీలుగా రాచబాటలు సిద్ధమయ్యాయి. రద్దీ సమయంలో భక్తుల ఇబ్బందుల దృష్ట్యా రోడ్లను విస్తరించారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేవదాయ ధర్మాదాయశాఖ, జీవీఎంసీ నుంచి రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో కొండపైకి రోడ్ల నిర్మాణం చేపట్టారు. తొలి ఘాట్ రోడ్డు పనులు పూర్తవగా, రెండో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి.


వేంకటాద్రిపైనున్న వెంకన్న ఆలయం


వేంకటాద్రిపై ముస్తాబైన రహదారి

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి వెంకన్నను దర్శించుకునేందుకు మనసు నిండా భక్తితోపాటు, రోడ్డు మార్గంలో చేరేందుకు ఓపిక కూడా ఎక్కువే ఉండాలి. శనివారాలు, పండగ సమయాల్లోనైతే ఈ రోడ్ల మీదుగా కొండ చేరేందుకు నానా అగచాట్లు పడాల్సి వచ్చేది. రోడ్లన్నీ గోతుల మయంగా ఉండేవి. ఇదంతా గతం. ప్రస్తుతం కొండపైకి ఘాట్‌రోడ్లు సిద్ధమయ్యాయి. తొలి ఘాట్ రోడ్డు ఇప్పటికే పూర్తవగా, రెండో ఘాట్ రోడ్డు పనులు ముగింపు దశలో ఉన్నాయి. ఓ మలుపు వద్ద రోడ్డు నిర్మాణానికి నిధుల కేటాయింపు కోసం ఉన్నతాధికారులు ఆమోదం తెలిపితే చాలు.. ఆ పనులు కూడా ప్రారంభం కానున్నాయి.

ఆ ఇక్కట్లు తీరాయి

పెందుర్తి వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరుని ఆలయం జిల్లాలో ప్రఖ్యాతిగాంచింది. రోజురోజుకూ భక్తుల తాకిడి విపరీతంగా పెరుగుతోంది. అందుకు తగ్గట్లు రహదారుల నిర్మాణంపై గత ప్రభుత్వాలు పెద్దగా దృష్టిసారించలేదు. కొండపైకి రాకపోకలకు ఒకే మార్గం ఉండడం.. అది కూడా గోతుల మయం, ఇరుగ్గా ఉండడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యేవారు. ముఖ్యంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగినప్పుడు భక్తులు రాకపోకలకు నరకం కనిపించేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికుల విన్నపం మేరకు ప్రభుత్వం చొరవ చూపింది.

అంతా సుందరమయం

వేంకటాద్రి ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, అధికారులు ఇక్కడి పరిస్థితిని గత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే ప్రధాన ఘాట్ రోడ్డుతో పాటు రెండో ఘాట్ రోడ్డు నిర్మాణానికీ రంగం సిద్ధమయింది. రూ.1.50 కోట్ల నిధులను కేటాయించింది. ఆ నిధులతో ప్రధాన ఘాట్ రోడ్డు, రెండో ఘాట్ రోడ్డు పనులను అధికారులు చేపట్టారు. ఘాట్ రోడ్లను విస్తరించి, కొత్తగా నిర్మించడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా పోయాయి. విశాలంగా, సుందరంగా ఉన్న రోడ్లపై భక్తులు ఆనందంగా రాకపోకలు సాగిస్తూ, స్వామి సేవలో తరిస్తున్నారు.

ఎంతో సంతోషంగా ఉంది



గతంలో ఒకటే ఘాట్ రోడ్డు ఉండడం వలన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తేవి. ఆలయంలో ఉత్సవాలు, ఏవైనా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేటపుడు కష్టాలు వర్ణనాతీతం. రద్దీ కారణంగా భక్తుల వాహనాల రాకపోకలకు చాలా నరకం చూడాల్సి వచ్చేది. ఆలయ ప్రధాన అర్చకులు రామానుజాచార్యుల చొరవ కారణంగా ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చింది. వెంటనే పనులు పూర్తవడంతో భక్తుల ఇబ్బందులు తీరాయి.

– బి.వి రమణప్రసాద్, భక్తుడు, పెందుర్తి

ఇప్పుడు హాయిగా వెళ్లి వస్తున్నాం



మాకు వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం, అక్కడి భక్తులకు సేవలందించడం అలవాటు. నిత్యం వేంకటాద్రి పైకి వస్తుంటాం. రోడ్ల పరిస్థితి బాగాలేక గతంలో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఎన్నోసార్లు ఘాట్ రోడ్ ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కుపోయాం. ఇప్పుడు ప్రధాన ఘాట్ రోడ్డు బాగుచేయడంతో పాటు, రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ఇబ్బందులు తీరాయి. హాయిగా వెంకన్నను దర్శించుకుని వస్తున్నాం.

– ఎస్.పద్మిని, భక్తురాలు, సుజాతనగర్

ప్రభుత్వం ఆసరా.. దాతల సాయం



వేంకటాద్రికి భక్తుల తాకిడి రోజు రోజుకూ పెరుగుతుంది. శనివారం, ప్రత్యేక రోజుల్లో కొండపైకి చేరేందుకు భక్తులు ఇబ్బంది పడేవాళ్లు. రోడ్ల నిర్మాణంతో పాటు కల్యాణ మండపం, ఓపెన్ ఆడిటోరియం, వెంకన్న ఆభరణాలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దాతలు కూడా ఓ చేయి వేస్తున్నారు. రోడ్ల నిర్మాణంతో ఎంతో ఊరట చెందామని భక్తులు చెబుతుంటే సంతోషంగా ఉంటుంది.

– మహర్షి రామానుజాచార్యులు, ప్రధానఅర్చకుడు

క్లుప్తంగా

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు


అధికారులకు సూచనలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా సింహగిరిపై ఎలాంటి అపారిశుధ్యం లేకుండా, తాగునీటి ట్యాంకుల్లో నీరు కలుషితం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అన్నప్రసాద భవనం, ప్రసాద విక్రయశాల తదితర ప్రదేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఎక్కడా వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలన్నారు. కొబ్బరికాయల చిప్పల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట దేవస్థానం ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం


స్వాతికి నగదు అందిస్తున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అడవివరం అంబేడ్కర్ కాలనీకి చెందిన విద్యార్థిని సందాల స్వాతికి కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. స్వాతి బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమెకు ఊపిరితిత్తుల సమస్య రావడంతో ఆస్పత్రిలో చేర్చి, చికిత్స అందిస్తున్నారు. స్వాతి కుటుంబం పేదరికంలో ఉండటంతో అప్పలస్వామి ఆస్పత్రికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ లండ వెంకటరమణ ఉన్నారు.

పీజీసెట్ రిపోర్టింగ్ తేదీ పొడిగించాలి


ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు వినతి పత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

విశాఖ సిటీ: ఏపీ పీజీసెట్–2024లో అడ్మిషన్లు పొందిన వారు రిపోర్టింగ్ చేసే తేదీని పొడిగించాలని బీసీ సంఘం నాయకులు సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావుకు వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా గ్రామాల నుంచి విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని, అందుకే తేదీ పొడిగింపుపై ఆలోచించాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీసీ సంఘం నాయకులు పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్ ఉన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌కు మద్దతుగా రాస్తారోకో

మల్కాపురం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆరోపించారు. ఈ అంశంపై మల్కాపురం వద్ద సోమవారం మాట్లాడారు. బీజేపీ సర్కార్ దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసి ఆయా సంస్థల్లో పని చేస్తున్న కార్మికులను రోడ్డు పడేయాలని కుట్ర చేస్తుందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వమే కొనసాగించాలనే డిమాండ్‌తో మంగళవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపడుతున్నట్టు వివరించారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చేపట్టే రాస్తారోకోలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

48 మంది రక్తదానం

అక్కిరెడ్డిపాలెం: అకాల మరణం పొందిన యువకుల జ్ఞాపకార్థం 69వ వార్డు తుంగ్లాంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. యువత, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో వందే భారత్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 48 మంది రక్తదానం చేశారు.

సీతంనాయుడు కుటుంబ సభ్యులకు పరామర్శ


సీతంనాయుడు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెం గ్రామంలో ఇటీవల మరణించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కన్నూరి సీతంనాయుడు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీకి సీతంనాయుడు అందించిన సేవల్ని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు కొటాన రాము, మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, యర్ర శ్రీనివాసరావు, కొటాన వెంకటరమణ, ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, పైల రమణ, కోట్ని నాయుడు, గవర రాజు తదితరులు ఉన్నారు. వీరితో పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పార్టీ నాయకులతో కలిసి సీతంనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయన వెంట యడ్ల నాయుడు, స్థానిక నాయకులు ఉన్నారు.

జారిపడిన రాళ్లు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతం వరాహగిరి కాలనీలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు బురద, చిన్నపాటి రాళ్లు ఇంటిపైకి వచ్చి చేరాయి. దీంతో వెంటనే స్థానికులు జీవీఎంసీ అధికారులకు తెలియజేశారు. కార్పొరేటర్ కంపా హనోకు జీవీఎంసీ అధికారులతో మాట్లాడి శుభ్రం చేయించారు.

అప్రమత్తంగా ఉండండి


మేహాద్రి రిజర్వాయర్ వద్ద వరద నీటి ఉధృతిపై ఆరా తీస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్


మేహాద్రి నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

- నీటి ఉధృతి పెరిగితే తక్షణమే మేహాద్రి గేట్లు ఎత్తివేత–జిల్లా కలెక్టర్

పెందుర్తి: ఎగువ ప్రాంతాలతో పాటు స్థానికంగా కూడా అధిక వర్షపాతం నమోదైనందున మేహాద్రి గెడ్డ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సూచించారు. నీటి ఉధృతి పెరిగి మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరితే తక్షణమే గేట్లు ఎత్తడానికి సిద్ధంగా ఉండాలని యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోపై ఆరా తీశారు. గేట్ల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట పెందుర్తి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, జెడ్పీ హైమావతి, ఇతర అధికారులు ఉన్నారు.

మేహాద్రిని పరిశీలించిన ఎమ్మెల్యే: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పరిశీలించారు. నీటిమట్టం, ఇన్‌ఫ్లోపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ హైమావతి, నీటిపారుదల శాఖ జేఈ నళిని, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

గరిష్ట స్థాయికి దగ్గరగా..: మేహాద్రిగెడ్డ నీటిమట్టం సోమవారం రాత్రికి 58 అడుగులకు చేరుకుంది. దీని గరిష్ట నీటి మట్టం 61 అడుగులు. ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌కు నీరు చేరుతుండడంతో మంగళవారం ఉదయానికి మరో అడుగు నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పరిస్థితిని సమీక్షించి గేట్లు ఎత్తుతామన్నారు.

వర్షానంతర పరిణామాలపై అప్రమత్తం

- భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయినవారిని గుర్తించాలి
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలో ఎమ్మెల్యే పంచకర్ల


పరవాడ సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల


సబ్బవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో అపారిశుధ్యపరిస్థితులు తలెత్తి ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అపారిశుధ్యం నెలకొన్న గ్రామాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో ప్రతిపాదించిన కొత్త పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయడానికి సభ తీర్మానించింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటి పారుదల, గృహనిర్మాణ శాఖల పనితీరుపై ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వి.హేమసుందరరావు, పరవాడ ఎస్‌డీపీవో సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు, వరదలకు ఒక్క బాధితుడు కూడా నష్టపోకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సోమవారం ఆయన సమీక్ష జరిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి బాధిత రైతులను గుర్తించాలన్నారు. చెరువులకు గండ్లు పడే పరిస్థితి ఉంటే ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాలకు పెద్దగా ముప్పు లేదన్నారు.

మేహాద్రిగెడ్డ పొంగి ప్రమాద స్థాయిని దాటిపోవడంతో గేట్లు ఎత్తి, నీటిని సముద్రంలోకి విడిచిపెట్టాల్సిందిగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుతో కలిసి ఆదేశించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ సబ్బవరం మూడు రోడ్ల కూడలి వద్ద వరదనీరు పోటెత్తడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ అధికారులను ఇదివరకే ఆదేశించామని చెప్తూనే, ఆర్ అండ్ బీ ఏఈ వాసుదేవరావు పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమీక్షలో ఎంపీడీవో రమేష్ నాయుడు, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీలక్ష్మీరాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఈవోపీఆర్డీ మహేష్, సీఐ పి.రమణ, ఇన్‌చార్జి ఏవో సుధాకర్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోపాడ అప్పారావు, ఉపాధ్యక్షుడు పిల్లల అప్పల నాయుడుతో పాటు పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గణనాథుడు.. జననాథుడు

- ఊరూవాడా చవితి మండపాల్లో విశేష పూజలు
- అన్నదానాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఊరూవాడా చలువ పందిళ్లు, మండపాల్లో కొలువుదీరిన గణనాథునికి భక్తులు విశేష పూజలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మండపాల వద్ద యువత సందడి ఎక్కువగా కనిపిస్తోంది.


గణనాథుడిని దర్శించుకున్న భక్తులు


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

పరవాడ: మండలంలో ఈదులపాక బోనంగి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి గ్రామ ప్రజలు సోమవారం ప్రత్యేక పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అట్టా సన్యాసప్పారావు, మంత్రి గిరిప్రసాద్, బొద్దపు వెంకటరమణ, మేడిశెట్టి రాజు, బొద్దపు అప్పలరాజు, కంచిపాటి మాధవ్, ఎం.సూర్యప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శివగాయత్రినగర్‌లో అన్నసమారాధన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజు పాలెం సమీపంలోని శివగాయత్రినగర్‌లో సిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు రెండు వేల మంది అన్న ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. కమిటీ ప్రతినిధులు బాలకృష్ణ, అప్పారావు, సత్యారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వడ్డన చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

ఘనంగా ముగ్గుల పోటీలు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాలనీలోని మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొని తమదైన శైలిలో ముగ్గులు వేశారు. కాలనీ యూత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు

‘ఒయాసిస్’ వైద్యుల నిర్లక్ష్యంపై పోలీసులకు ఫిర్యాదు


చికిత్స పొందుతున్న రోజా

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్ ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్‌లో వైద్య పరీక్షలు సరిగ్గా చేయకపోవడంతోపాటు వైద్యులు నిర్లక్ష్యం వహించడంతో తన భార్య ప్రాణాపాయ స్థితికి చేరిందని ఆరోపిస్తూ భర్త పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన పొంగి నసింద్ర కుమార్ తన భార్య రోజాకు సంతానం కోసమని గత నెల 20న విశాఖ రామ్‌నగర్‌లోని ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్‌ను సంప్రదించారు. అక్కడి వైద్యులు వారికి పలు వైద్య పరీక్షలు చేశారు. ఈ నెల 2న మళ్లీ వారు ఆస్పత్రికి రాగా.. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఎటువంటి సమస్య లేదని చెప్పారు. రెండు రోజుల తర్వాత రోజాకు కడుపులో నొప్పి తీవ్రంగా రావడంతో సమీప ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పలు పరీక్షలు చేసి.. ఆమె లోపల అధిక రక్తస్రావం జరిగినట్లు నిర్ధారించి, అత్యవసర శస్త్రచికిత్సలు నిర్వహించారు. రోజా ఎక్టోపిక్ (గర్భాశయం బయట) గర్భం దాల్చిందని, అందువల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వైద్యులు తెలిపారు. తమకు ఈ గర్భం కోసం ఒయాసిస్ సెంటర్ డాక్టర్లు తెలియజేయలేదని, పైగా ఎటువంటి సమస్య లేదని చెప్పారని బాధితులు వాపోయారు. కేవలం ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్ వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య రోజా అనారోగ్యానికి గురైందని భర్త పేర్కొంటూ ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. వైద్య పరీక్షల ద్వారా కొన్నిసార్లు ఎక్టోపిక్ గర్భాన్ని గుర్తించలేమని ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాధిక తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని వినతి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కేంద్ర భారీ, ఉక్కు పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్‌ను కోరారు. సోమవారం ఆయన న్యూఢిల్లీలో కుమారస్వామిని, ఉక్కు కార్యదర్శిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తక్షణ ఉపశమనం కోసం రూ. 10 వేల కోట్లు మంజూరు చేయాలని, స్టీల్‌ప్లాంట్ పూర్తి ఉత్పత్తి సాధించేందుకు అవసరమైన ముడి సరుకు, భవిష్యత్ అవసరాలకు సరిపడా సొంత గనులు సమకూర్చాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్టు రాజశేఖర్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎన్. రాజు ఉన్నారు.

పర్యావరణం, నీటి వనరులను పరిరక్షించాలి


మాట్లాడుతున్న ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రజల ఆలోచనా ధోరణి మారాలని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ విభాగంలో సోమవారం బయో ఈ3 పాలసీపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలంటే.. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, నీటి వనరుల ప్రాంతాల్లో నిర్మాణాలను నిరోధించాలన్నారు. సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ) ప్రతినిధి డాక్టర్ యతీష్ ఆచార్ మాట్లాడుతూ భవిష్యత్తులో బయోటెక్నాలజీతో సాంకేతిక విప్లవం వస్తుందని, 2030 నాటికి బయో ఎకానమీ 300 బిలియన్ డాలర్లు దాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి బయో ఎకానమీ 10 ట్రిలియన్ డాలర్లతో దేశ జీడీపీలో 25 శాతం మేర వాటా ఉండే అవకాశం ఉందన్నారు. సదస్సులో సీడీఎఫ్‌డీ ప్రతినిధులు డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఎం.వి.సుబ్బారెడ్డి, డాక్టర్ రమేష్ ఎలగందుల, డాక్టర్ అశ్విన్ దలాల్, ఏయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ పోలా సుధాకర్, డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ పి.బిందియా, డాక్టర్ సుబ్బాతాతా, ప్రొఫెసర్ పద్దయ్య, స్కాలర్లు పాల్గొన్నారు.

‘అప్కోరా’ ఎన్నికల్లో బీఎంఎస్ విజయం

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలోని అశోకా పార్క్ పౌర నివాసితుల సంఘం(అప్కోరా)కు ఆదివారం జరిగిన ఎన్నికల్లో బీఎంఎస్ యూనియన్ బలపర్చిన ఓడ ప్యానల్ అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. తొమ్మిదికి తొమ్మిది స్థానాలను కైవసం చేసుకోడంతో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎన్నికలకు ముందే ట్యూనా బెహరా ఉపాధ్యక్షుడిగా, బినోద్‌కుమార్ మండల కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన ఏడు స్థానాలకు ఆదివారం ఎన్నికల అధికారి పరిపాలన భవనంలో ఎన్నికలు జరిగాయి. అనంతరం ఫలితాలు ప్రకటించగా ఓడ ప్యానల్‌కు చెందిన బీఎంఎస్ అభ్యర్థి జి.చిరంజీవి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 109 ఓట్ల భారీ మెజారిటీతో ప్రత్యర్థి హరిబాబుపై విజయం సాధించారు. కమిటీ కార్యదర్శిగా వై.పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సునీల్‌కుమార్‌లాల్, కోశాధికారిగా బి.అప్పారావు(భద్ర) అదే స్థాయిలో గెలుపొందారు. కార్యనిర్వాహక సభ్యులుగా ఎస్.ఎం.కె.సునీల్‌కుమార్, అనూప్‌సింగ్, ఎస్.రామారావు విజయం సాధించారు. వీరంతా రెండేళ్ల పదవుల్లో ఉంటారు. విజయోత్సవ వేడుకల్లో గెలుపొందిన వారితో పాటు బీఎంఎస్ అనుబంధ ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం గుర్తింపు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా విద్యాసాగర్, ఎస్.రాజేష్, ఉపాధ్యక్షులు షణ్ముఖరావు, మెటీరియరిల్ ఆర్గనైజేషన్ జె.సి.ఎం. ఫోర్త్ లెవెల్ సభ్యులు మోహనరావు విజేతలకు అభినందనలు తెలిపారు.